కృష్ణుడికి చెప్పినటువంటి స్తోత్రం రాధకు వర్తిస్తుంది, రాధకు చెప్పినటువంటి స్తోత్రం కృష్ణుడికి వర్తిస్తుంది. బాహ్యదృష్టికి, చర్మదృష్టికి ఒకటే ఇద్దరుగా కనిపిస్తున్నారు. మనం భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, కర్మమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆనేను నుండి విడుదలపొందాలి. ఆ నేనులో నుండి విడుదలపొందకపోతే అది చెప్పేదే మనకు ప్రమాణంగా ఉంటుంది, అది చెప్పినట్లు తిరుగుతూ ఉంటాము. ఇంతవరకు ఈ సృష్టిలో దేహగతమైననేనుకు పరిమితమై ఉన్న వాడికి ఎవడికి బ్రహ్మసాక్షాత్కారం కలుగలేదు. దేహాత్మబుద్ధి ఉన్నవాడికి బ్రహ్మానుభవం కలుగనే కలుగదు, ఇందులో సందేహం లేదు. విష్ణుసహస్రనామాలలో విష్ణువుకు అనేక పేర్లు ఉన్నాయి, పేర్లు ఎన్ని ఉన్నా విష్ణువు మటుకు ఒక్కడే. బ్రహ్మం ఒక్కటి అంటే ఒక్కటే. మీరు జపం చేసుకొనేటప్పుడు రామబ్రహ్మం, కృష్ణబ్రహ్మం, శివబ్రహ్మం అని ఇలా మీకు ఇష్టమైన నామాలతో చేస్తారు. జపం చేసేటప్పుడు రాముడు అంటే బ్రహ్మమునే దృష్టిలో పెట్టుకొని చేయాలి. అంటే రాముడు అనే రేవు ద్వారా బ్రహ్మంలో ఐక్యం అవ్వటానికి మీరు ప్రయత్నం చేస్తున్నారు. నామరూపములు అన్నీ బ్రహ్మంలో కల్పితములు. అందుచేత రాముడు అనేటప్పటికి అంతటా వ్యాపించి ఉన్న బ్రహ్మం, చైతన్యం గుర్తుకు రావాలి. భగవంతుడు మనకు గోచరించడు, శుద్ధంగా ఉన్న సద్వస్తువు శుద్ధబుద్ధికి, పవిత్రమైన మనస్సు ఉన్నవాడికి గోచరిస్తుంది. వసుదేవుడు తన సంతానాన్ని కంసుడికి సమర్పించేవాడు. ఏదైనా కొంచెం దుఃఖం ఉన్నా, అశాంతి ఉన్నా అవి అన్నీ నిగ్రహించుకొని, సమానం చేసుకొని సమర్పించేవాడు, దాని ఫలితంగా పరమాత్మ ఆవిర్భవించాడు. కంసుడికి గర్వం ఎక్కువ, కంసుడు విషయం అక్కరలేదు మనం అయినా అంతే. గర్వం ఎప్పుడు వస్తుంది అంటే ఇప్పుడు మనకు ఎంత అయితే జీర్ణశక్తి ఉందో అంతకంటే ఎక్కువ తిన్నాము అనుకోండి అజీర్తి వస్తుంది, అలాగే మనం ఎంతవరకు భరించగలమో దానికి మించి వస్తూ ఉంటే అప్పుడు గర్వం వస్తుంది, అహంకారం వస్తుంది, రజోగుణం వస్తుంది. మీకు ఎంత వరకు యోగ్యత ఉందో అంతకు మించి మీకు ఏదైనా గౌరవం వచ్చినా, కీర్తి వచ్చినా అది అంతా గర్వం కింద మారిపోతుంది. కంసుడి పరిస్థితి కూడా అంతే. అంటే కంసుడికి ఎంత అర్హత ఉందో దానికి మించిన అధికారం రావటం వలన అతనికి గర్వం వచ్చింది. ఒక మనిషికి ఎంత అధికారం వచ్చినా ఆ అధికారం అతనికి లోబడి ఉంటే అప్పుడు అధికారం చిన్నగా ఉంటుంది, అతని యొక్క పరిపక్వత గొప్పగా ఉంటుంది. అన్ని శక్తులు మాయే, ఒక్క బ్రహ్మం మాత్రమే సత్యం. మనకు ఉన్న డబ్బు, చదువు అంతా మాయే, బ్రహ్మం తప్పించి అంతా మాయే. కాని ఆ మాయ మనకు సత్యంగా కనిపిస్తోంది కాబట్టి మనకు గర్వం వస్తోంది. జీవుడికి పరిమితులు ఉంటాయి కాని బ్రహ్మంకు పరిమితులు లేవు. ఏ వస్తువుకయితే పరిమితులు ఉన్నాయో ఆ

వస్తువు నిజం కాదు. ఇప్పుడు మన మనస్సు ఏది చెపితే అది మనకు ప్రమాణం. వారిని ద్వేషించమంటే ద్వేషించేస్తాడు. వారి మీద కోపగించుకోమంటే కోపగించుకొంటాము. అందరిమీద భేదబుద్ధి పెంచుకొంటాము. మన స్వార్థానికి ఎవరైనా విరుద్ధంగా ప్రవర్తిస్తే వారి మీద ఇంకా ఆగ్రహం కలుగుతుంది, అసూయ కలుగుతుంది. సూర్యుడు మనకు ఎంతో వెలుతురును ఇస్తున్నాడు కాని మనం సూర్యుడిని చూసి అసూయ పడము. ఎవరో ఏదో మంచి పనులు చేస్తూ ఉంటే, సమాజానికి ఉపయోగ పడుతూ ఉంటే వారినిచూసి అసూయపడతాము. వారు సూర్యుడి కంటే గొప్పవారు ఏమీ కాదు, మరి వారినిచూసి అసూయపడటం ఎందుకు? ఫలానా దేహం నాది, ఫలానా పేరు నాది అని ఒక దేహంతోను, ఒక పేరుతోను తాదాత్మ్యం పొందుతున్నంతకాలం ఎవరూ నిన్ను సుఖపెట్టలేరు. ఒక నామంతో గాని, ఒక రూపంతోగాని నీకు తాదాత్మ్యం లేనప్పుడు ప్రపంచంలో ఎవ్వడూ నిన్ను దుఃఖ పెట్టలేడు. నాకు రూపబుద్ధి, నామబుద్ధి ఉన్నప్పడు మీరు నాకు దుఃఖాన్ని తీసుకొనిరాగలరు. నాకు రూపబుద్ధి, నామబుద్ధి లేనప్పడు నాకు దుఃఖాన్ని తీసుకొని రావటం మీ వల్లకాదు, ప్రయత్నం చేసినా ఫెయిల్ అవ్వటమే మిగులుతుంది.

త్రివేణీ సంగమం అంటే గంగ, యమున, సరస్వతి. ఈ మూడు నదులు కలసిన చోటు. అలాగే భక్తి, జ్ఞానం, వైరాగ్యం ఈ మూడు కలిస్తే త్రివేణి సంగమం, భగవదనుభవం పొందటానికి ఈ మూడూ ఐక్యమవ్వాలి. మన బుద్ధిలో ఉన్న దోషాలు చూసుకోవటం మానివేసి ఇతరుల బుద్ధిలో దోషాలు చూస్తూ ఉంటాము, మనలో రజోగుణం పెరగటానికి కారణం ఇదే. వాడు ఎందుకు పనికిరాడు, నేను గొప్పవాడిని అనుకొంటాడు. వాడు అలా ఎందుకు అనుకొంటాడు అంటే వాడు నిజంగా గొప్పవాడు కాబట్టి అనుకోవటం కాదు, వాడిలో ఉన్న రజోగుణం అలా అనిపింపజేస్తుంది. మనకు ఉన్న భక్తి, వినయమే నిజమైన సంపద. ఇతరులలో ఉన్న దోషాలు చూడటం మానివేసి మన బుద్ధిలో ఉన్న దోషాలు చూసుకొంటూ ఉంటే మనకు సత్వగుణం పెరుగుతుంది, సాత్వికబుద్ధి కలుగుతుంది. మీరు మననం చేయదగినవాడు పరమాత్మ, శ్రవణం చేయదగినవాడు పరమాత్మ. మిమ్మల్ని బాగుచేసేవాడు పరమాత్మ, మిమ్మల్ని జ్ఞానసముద్రంలో, శాంతిసముద్రంలో ముంచేవాడు పరమాత్మ. అటువంటి పరమాత్మను మననం చేయటం మానివేసి ఎవడో బుద్ధిలో ఉన్న దోషాలను మననం చేస్తానంటావు ఏమిటి? ఇటువంటి చిల్లర గొడవలు అన్నీ వదిలేసి పరమాత్మను మననం చేస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా అది ఇష్టంతో చెయ్యి, ప్రేమగా చెయ్యి, భక్తితో చెయ్యి. నేను జపం భక్తిగా చేస్తున్నాను, ప్రేమగా చేస్తున్నాను కాని మనస్సు కుదురుపడటం లేదు అని ఒకరు అడిగారు. మీకు అమ్మాయిలు ఉన్నారా? అని నేను అడిగాను. ఇద్దరు అమ్మాయిలు అని చెప్పింది. నీవు

ప్రేమగా జపం చేస్తున్నాను అంటున్నావు, మరి మీ అమ్మాయి మీద ఉన్నంత ప్రేమ, నీవు జపం చేసే దేవత మీద ఉందా? అని అడిగితే లేదు అని చెప్పింది. మీ అమ్మాయి మీద ఉన్నంత ప్రేమ కూడా నీకు దేవుడి మీద లేదు మరి ప్రేమగా జపం చేస్తున్నాను అని చెపుతున్నావు ఏమిటి? మీ అమ్మాయిని ప్రేమించటానికి నీకు సాధన అక్కరలేదు, దేవుడిని ప్రేమించటానికి సాధనా? అంటే దేవుడు మీద మీకు ఇష్టం లేదని అర్థం. నువ్వు ప్రేమతోటి, భక్తితోటి జపం చేస్తూ ఉంటే నీవు తేలికగా భగవదనుభవం పొందగలవు. మనం అజ్ఞానంలో ఉన్నాము, అజ్ఞానం పనులు అన్నీ చేస్తున్నాము. మనం ఎవరినీ క్షమించము. కాని మనం అజ్ఞానంలో ఉన్నాము, అజ్ఞానం పనులు చేస్తున్నాము అని తెలుసుండి కూడా భగవంతుడు మనలను క్షమిస్తున్నాడు, వాడు దేవుడు. మనలో ఉన్న అజ్ఞానాన్ని పూర్తిగా తొలగించుకొంటాము అనుకోండి, మనం నశించము, ఈశ్వరుడు మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మోక్షం అంటే మనం భగవంతుడు అవ్వటం కాదు, భగవంతుడి యొక్క స్వరూపాన్ని పొందుతాము. భగవంతుడి యొక్క స్వరూపం చైతన్యం, ఆయన స్వరూపం శాంతి, ఆయన స్వరూపం ఉండటం, అది మనం పొందుతాము. ఒకసారి భగవాన్‌తో ఒక భక్తుడు ఏమని చెప్పాడు అంటే అహం బ్రహ్మాస్మి అని చదివి నేను భగవంతుడినే అనుకొంటున్నాను అని చెప్పాడు. నువ్వు భగవంతుడివి అనుకోకు, భగవంతుడిని పొందటానికి ప్రయత్నం చెయ్యి అని చెప్పారు. భగవంతుడిలో సుఖం ఉంది, శాంతి ఉంది, ఆనందం ఉంది. భగవదనుభవం మనకు కలిగింది అంటే సుఖమే మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే నీకు సంసారం వలన దుఃఖం వస్తోందనుకో, సంసారదుఃఖం నశించాలంటే సత్పురుషుల సాంగత్యం వలన మాత్రమే నీకు సంసారదుఃఖం నశిస్తుంది, దానికి కేవలం నీ సాధన సరిపోదు అన్నారు. అజ్ఞానం ఎలా పోతుంది? జ్ఞానం కలిగితే పోతుంది. ఆత్మజ్ఞాన సముపార్జన వలన అజ్ఞానం నశిస్తుంది. మనకు శవబుద్ధి నశించాలి, శివబుద్ధి కలగాలి దానికే జ్ఞాన సముపార్జన. అజ్ఞానానికి పరిమితులు ఉన్నాయి, చైతన్యానికి పరిమితులు లేవు. ఆ చైతన్య స్వరూపం పొందినప్పుడు అంతటా మనం ఉన్నామని మనకు అనిపిస్తుంది, అఖండంగా ఉన్నామని అనిపిస్తుంది. మనం ఎక్కువగా అవసరంలేని గొడవలలో కలుగ జేసుకొంటాము, అవసరం లేని వ్యక్తులతో మాట్లాడుతూ ఉంటాము, వారితో తిరుగుతూ ఉంటాము. నువ్వు నిరంతరం భగవంతుడిని స్మరిస్తూ ఉంటే ముందు ఈ గొడవలలో నుండి బయటకు వస్తావు. నువ్వు ఇంటి దగ్గర పడి ఉండు అంతేగాని రోజూ షాపింగ్‌కు వెళ్తాను అంటే ఎలాగ? ఇంటి దగ్గర కాలక్షేపం అవ్వకపోతే గుడిలోనికి వెళ్ళి ఈశ్వరుడిని స్మరించుకోవచ్చు కదా? దానివలన మీకు ఏమీ ఖర్చు అవ్వదు కదా! నిరంతరం భగవంతుడ్ని స్మరిస్తూ ఉంటే ముందు మీరు ప్రమాదంలో పడకుండా ఉంటారు, అనాత్మ గొడవలలో

పడకుండా ఉంటారు, మీకు మీరు దూరం అవ్వకుండా ఉంటారు. అవసరంలేని విషయాలను చింతిస్తూ ఉండటం వలన మన స్వరూపానికి మనం దూరమయిపోతాము.

భగవంతుడిని స్మరించగా స్మరించగా ఉన్నవాడు ఆయన ఒక్కడే అని నీ మనస్సులో స్థిరపడుతుంది, బుద్ధి నిర్మలమవుతుంది, నువ్వు సుఖపడతావు, నీకు శాంతి కలుగుతుంది, ఆనందం కలుగుతుంది. మీ అమ్మాయి సంసారం బాగుంది అనుకోండి అందుకు మీకు సంతోషం వస్తుంది. ఎందుచేత ఆ అమ్మాయితో మీకు ఉన్న అనుబంధాన్ని బట్టి సంతోషం వస్తుంది. అటువంటి సంతోషం కాదు ఇక్కడ భగవాన్ చెప్పేది. బాహ్యవస్తువులతోగాని, వ్యక్తులతోగాని, బంధువులతోగాని, పరిసరాలతోగాని, నీకు ఉన్న ఐశ్వర్యంతో గాని ఎట్టి సంబంధం లేకుండా పరమాత్మను చింతించటం వలననే నీకు ఆనందం వచ్చేస్తుంది, అంతేకాదు నీకు ప్రమాదం కలిగించే విషయాల నుండి కూడా బయట పడతావు. మనిషి పొరపాటు చేయకూడదు అని అనుకొంటాడు కాని ఎందుకు పొరపాటు చేస్తున్నాడు అని అడిగితే దానికి కోరిక, కోపం కారణం అని భగవంతుడు చెప్పాడు. నిరంతరం పరమాత్మను స్మరించటం వలన వాసన సన్నగిల్లుతుంది, వాసన నశించినప్పుడు కోరిక కూడా నశిస్తుంది. లోపల ఉన్న సుఖం నీ సహస్రారానికి అందుతూ ఉంటే సహజంగానే నీ మనస్సుకు బయటకు వెళ్ళే అలవాటు తగ్గిపోతుంది. ఎలాగంటే ఒక ఆవు ఉంది అనుకోండి. అది తాడు తెంపుకొని ఎక్కడో వట్టిగడ్డి మేయటానికి వెళుతోంది అనుకోండి. మీరు అక్కడ పచ్చగడ్డి పెట్టండి ఇంక దానిని తాడుతో కట్టనక్కరలేదు. దానికి స్వేచ్ఛ ఇచ్చినా ఈ పచ్చగడ్డిని వదలి వట్టిగడ్డి దగ్గరకు వెళ్ళదు. అలాగే లోపలఉన్న సుఖం నీ మనస్సుకు అందుతూ ఉంటే మనస్సును బయటకు వెళ్ళమన్నా అది వెళ్ళదు. అదే భగవాన్ చెపుతూ ఉండేవారు మీ మనస్సును ఆగమంటున్నారు, అది ఆగటం లేదు, నా మనస్సును కదలమంటున్నాను అది కదలటంలేదు, అంతా తానే. ఇంక అది ఎక్కడికి వెళుతుంది. ఈ క్లూ మీకు అర్థమవ్వాలి. గాఢనిద్రలో తప్పించి మిగిలిన టైము అంతా ఏదో నామచింతన, రూపచింతన. ఏదో ఆకారాన్ని, ఏదో నామాన్ని తలపెట్టుకోవటం దేహబుద్ధిని పెంచుకోవటం. నీ రూపమే నువ్వు కానప్పుడు, నీ నామమే నీవు కానప్పుడు వాడి రూపం వాడు ఎలా అవుతాడు, వాడి నామం వాడు ఎలా అవుతాడు. ఇది అర్థమయితే ఇప్పడే ఈ క్షణంలో మీకు దుఃఖం నశిస్తుంది, భయం నశిస్తుంది. మీరు రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి విడుదల పొందినప్పడు చైతన్యంలో ఐక్య మవుతారు. చైతన్యంలో ఐక్యం అయ్యాక మిమ్మల్ని దుఃఖపెట్టేది, భయపెట్టేది ఇంక ఈ సృష్టిలో ఏమీ ఉండదు. మనం భగవంతుడిని ఏదైనా కోరికలు కోరుతూ ఉంటాము, ఒకోసారి ఇవ్వడు, ఆయనకు ఇచ్చే శక్తి లేకకాదు, ఇస్తే పాడయిపోతాము అని ఆయనకు తెలుసు. మన మనస్సు ఎంత వరకు సమాయత్తం అయ్యిందో ఆయనకు తెలుస్తూ

ఉంటుంది, అంతవరకే ఇస్తూ ఉంటాడు. కొంతమంది గుడికి వెళతారు, ఆ రూపాన్ని చూసుకొంటారు, ఆయన నామాన్ని స్మరించుకొంటారు. లోపల ఏమీ కోరికలు ఉండవు, భగవంతుడి యొక్క దయాగుణం, ఆయన వైభవానికి మురిసిపోయి కన్నీళ్ళు పెట్టుకొంటారు. నాకు చేతులు ఇచ్చావు నీకు నమస్కారం పెట్టటానికి, నాకు కాళ్ళు ఇచ్చావు నీ గుడి చుట్టూ తిరగటానికి, నా పొట్టకు లోటులేకుండా అన్నం ఇచ్చావు, ఇలా ఇచ్చిన వాటికి మురిసిపోయి ఈశ్వరుడికి నమస్కారం పెడతాడు. మనలో ఎంతమంది ఇలా ఉన్నారు. కొంతమందికి చేతి నిండా డబ్బు ఉంటుంది కాని సంతృప్తి ఉండదు, కొంతమందికి డబ్బు లేకపోయినా సంతృప్తిగా ఉంటారు, కళ్లతో భగవంతుడిని చూస్తూ ఆనందిస్తారు. ఎప్పడూ ఏ విషయంలోను ఇతరులతో పోల్చుకోకూడదు. నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఆ మార్గంలో నువ్వు అంకితమై చెయ్యాలి, నిండుమనస్సుతో చెయ్యాలి. కాని మన హృదయంలో ఉన్న వస్తువు ఎంత పవిత్రమైనదో, ఎంత ఏకాగ్రమైనదో, ఎంత నిదానమైనదో ఆ స్థాయికి మనం వచ్చే వరకు అది మనకు ఎరుకపడదు. నిరంతరం నన్ను స్మరిస్తూ ఉంటే ఎటువంటి బుద్ధిని ఇస్తే నా తాలుక ఎరుక నీకు కలుగుతుందో అటువంటి బుద్ధిని నీకు ప్రసాదిస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు. మాకు ఏమీ ఇష్టాలు లేవండి, భగవంతుడి ఇష్టమే మా ఇష్టం అంటారు, ఆయన సంకల్పమే మా సంకల్పం అంటారు, దాని వలన ఏమౌతుంది అంటే నీవు భగవంతుడంతటి వాడవు అవుతావు. భగవంతుడంతటి వాడవు నీవు అయినప్పడు కదా భగవంతుడు ఆయన హృదయంలో నీకు చోటు ఇచ్చేది. స్వార్థపరుడు తన స్వార్థంకోసం ఎలా పని చేస్తాడో, స్వార్థం లేకుండా లోక సంగ్రహం కోసం, లోక కళ్యాణం కోసం నువ్వు అలా పని చేస్తే పెద్దపెద్ద యోగులు, జ్ఞానులు అందరూ ఏ స్థానాన్ని పొందుతారో నువ్వు కూడా ఆ స్థానాన్ని పొందుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. కొంతమంది గౌరవం వస్తుంది అంటే మంచిపనులు చేస్తారు, అది కూడా ఒక కోరిక, నువ్వు ఈశ్వర ప్రీత్యర్థం పనిచెయ్యి. ఏమండీ మీరు పూర్వం చాలాకష్టాలు పడ్డారు, ఈ మధ్యన బాగానే ఉన్నారు, పచ్చగా ఉన్నారు అంటాము అనుకోండి. ఏదో కష్టపడ్డాము, చేసింది కలిసివచ్చింది అని అలా అనరు, ఏదో ఈశ్వరుడు ఇలా నిలబెట్టాడు అండీ, ఆయన నిలబెట్టకపోతే మేము ఇలా ఎలా ఉండగలము అంటారు. అది నిరహంకార స్థితి. అదేమిటండీ మీరు చాలా కష్టపడ్డారు కదా అంటే కష్టపడితే మటుకు వస్తుందా? ఆయన దయలేకపోతే మనం ఎంత కష్టపడినా రాదు కదా అంటారు. లోకంలో అనేకమంది కష్టపడుతున్నారు, వారందరికీ కలిసి వచ్చిందా? ఏదో భగవంతుడి దయ వలన ఇలా నిలబడ్డాము, మేము ఎవరం నిలబడటానికి? ఆయన నిలబెడితే ఇలా నిలబడ్డాము అంటారు. భగవంతుడి సంకల్పం పట్ల గౌరవం అలా ఉన్నా మూలతలంపు నశిస్తుంది అంటున్నారు భగవాన్. హారతికర్పూరం ఎలా అయితే కరిగిపోతుందో అలాగే

భక్తి తత్త్వంలో, శరణాగతి భావనలో మూలతలంపు శేషం లేకుండా నశిస్తుంది. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చెయ్యి, ఇతరులను అనుసరించవద్దు. మనుషులు రకరకాలుగా ఉంటారు, వారి గుణాలు వేరు, రంగులు వేరు, మనస్సులు వేరు, వారి జీవితవిధానం వేరు. ఇలా రకరకాలుగా ఉంటారు ఎందుచేతనంటే అజ్ఞానం రకరకాలుగా ఉంటుంది. అలా ఉన్నప్పటికీ అందరిలోను నన్ను ఒక్కడినే నువ్వు చూస్తూ ఉంటే అప్పుడు నీవు నా దయకు పాత్రుడవు అవుతావు అని పరమాత్మ చెపుతున్నాడు, అప్పుడు అసలు నీకు రియాక్షనే ఉండదు. లోకంలో ఏమీ లేదు, మనకు ఉన్న వాసనలను బట్టి కోరికలను బట్టి లోకంలో ఏదో ఉంది అనుకొంటున్నాము కాని లోకంలో ఏమీ లేదు. లోకం నిజంగా ఉంది అనుకో మరి నీ గాఢనిద్రలో ఈ లోకం ఎక్కడికి పోతోంది అంటున్నారు భగవాన్. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. సూర్యుడికి కాంతిని ఆయనే ఇస్తున్నాడు, చంద్రుడికి చల్లదనాన్ని ఆయనే ఇస్తున్నాడు. ఇంక సూర్యుడు ఎక్కడ ఉన్నాడు, చంద్రుడు ఎక్కడ ఉన్నాడు, మనం ఎక్కడ ఉన్నాము. రమణమహర్షిగారిలో దేవుడు ఉన్నాడు, మనలో దేవుడు లేడు అని కాదు, ఆయనలో దైవానికి సంబంధించిన శక్తి ఎక్కువగా వ్యక్తమవుతోంది అందుచేత ఆయనను ఋషి, మహాత్ముడు అంటున్నాము. ఒక ప్రాంతంలో ఉండి, ఇంకో ప్రాంతంలో లేకపోతే ఆయన దేవుడే కాదు. మనమూ ఉన్నాము, భగవంతుడూ ఉన్నాడు అని మనం అనుకొంటున్నాము. మనం లేనేలేము, ఉన్నది భగవంతుడు ఒక్కడే అంటున్నారు భగవాన్. ఒకవేళ మీలో ఏదైనా మంచి ఉంది అనుకోండి, ఆ మంచిని మీకు ఇచ్చింది ఎవరు? భగవంతుడే ఇచ్చాడు. ఇంక మీరు ఎక్కడ ఉన్నారు. భగవంతుడు ఇచ్చిన దానితో మీరు తాదాత్మ్యం పొందటం వలన నేను ఏదో సాధించాను అని మీకు అనిపిస్తుంది అంతే, అంతకంటే ఏమీలేదు. భగవంతుడు మాలాంటి వారికి ఎలా తెలియబడతాడు అని కొంతమంది అంటారు, మీకు శుద్ధబుద్ధి కనుక ఉంటే ఆయన మీకూ తెలియబడతాడు. మేము దేహగతమైన నేనును విడిచిపెట్టలేము, మాకు బంధువులు ఉన్నారు, స్నేహితులు ఉన్నారు హెచ్చుతగ్గులు ఉన్నాయి అని వీడు చెపుతూ ఉంటే, ముందు అసలు నువ్వు భగవంతుడంటూ ఒకడు ఉన్నాడు అని పూర్తిగా నమ్మటం నేర్చుకో. వాడు ఉన్నాడో, లేడో అని నీకు అనుమానం వస్తూ ఉంటే ఇంక నీవు ఏమి శరణాగతి చెందుతావు. ముందు ఆయన ఉన్నాడని విశ్వసించు, తరువాత నెమ్మదిగా శరణాగతి పొందటం నేర్చుకో. నీకు దర్శనం ఇస్తాడు లేకపోతే ఇవ్వడు, నీ కోరిక నెరవేరుస్తాడు లేకపోతే నెరవేర్చడు, ఆ గొడవలు వద్దు. ఆయన మాటకు నీవు కట్టుబడి ఉండు, ఆయన పాదాలను ఆశ్రయించి ఆయన చెప్పినట్లు నడుచుకో, అదే శరణాగతి. మీరు ఆయన పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే కాలప్రవాహంలో మీ హృదయాన్ని వికసింపచేసి ఎప్పుడో సడన్‌గా ఈశ్వరుడు మీకు

స్వరూపంగా వ్యక్తమవుతాడు, మనకు కాలం కలసిరావాలి, తొందరపడకూడదు. భగవంతుడు అంటే మనలాంటి వాడు అనుకోవద్దు. చిన్న పిల్లవాడుగా ఉన్నప్పడు గోవర్ధనగిరిని ఎత్తాడు, పెద్దపామును విషం కక్కించాడు, ఆ పనులు మనం చేయలేము, కాని వాటిని విని ఆనందించే యోగ్యత కూడా మనకు లేదు. నీకు మోక్షం ఎప్పడు ఇవ్వాలో ఆయనకు తెలుసు, దాని గురించి కంగారు పడవద్దు. నీ భారమంతా ఆయన మీద ఉంచి నీవు హాయిగా జీవించు. నీకు దుఃఖపడవలసిన పనిలేదు, ఒకవేళ నీకు ఏదైనా బెంగ ఉంది అనుకో, ఆ బెంగను కూడా ఆయనకు ఇచ్చేయి, ఆయనే మోస్తాడు. ఈ ప్రపంచం బరువు అంతా మోసేవాడు నీ ఒక్కడి బరువు మోయలేడా అనేవారు భగవాన్. శరణాగతి నీకు మొదట్లో కష్టంగా ఉంటుంది, అభ్యాసం చెయ్యండి, ఎంత వరకు చేయగలిగితే అంతవరకు చెయ్యండి, ఈశ్వరభావన ముఖ్యం, భావనా బలం పెంచుకోండి. భగవంతుడు తప్పించి మీరు భావన చేయదగినవాడు, మననం చేయదగినవాడు ఎవడూ లేడు, ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. మనం భగవంతుడిని మననం చేయటం లేదు, లోకం గొడవలు వేసుకొని కూర్చుంటున్నాము, ఆ రోజుకారోజు, ఆ జన్మకు ఆజన్మ భగవంతుడికి దూరమయి పోతున్నాము. విషయచింతన వలన నువ్వు పవిత్రుడవు అవ్వవు, చివరకు నీ బుద్ధి కూడా శుభ్రంగా పాడైపోతుంది. బుద్ధి పాడైపోయిన తరువాత మీకు ఎన్ని ఉన్నా ప్రయోజనం లేదు, మనం ఎంత వరకు పతనమవుతామో చెప్పలేము. అందరూ మాకు శాంతి కావాలి, మాకు శాంతి కావాలి అంటున్నారు. మీకు భక్తి లేదు, శరణాగతి లేదు, విచారణ లేదు, ఏది పరిణామంలో మనకు అశాంతిని తీసుకొని వస్తుంది, ఏది శాంతిని తీసుకొని వస్తుంది అని విభజించుకొనే శక్తి మీకు లేదు, జపం లేదు, ధ్యానం లేదు, మీకు శాంతి కావాలి అంటే ఎలా వస్తుంది. సజ్జన సాంగత్యం లేకుండా, శరణాగతి లేకుండా, విచారణ లేకుండా, వివేకం లేకుండా నీకు శాంతి ఎలా కలుగుతుంది. నాలుగు గోడల మధ్య కూర్చుంటే శాంతి కలుగుతుందా? పోనీ నాలుగు గోడల మధ్య కూర్చుని భగవంతుడిని స్మరించుకొంటున్నావా, ధ్యానించుకొంటున్నావా? భగవంతుడి ప్రెజెన్స్‌ను నీవు ఫీలవుతున్నావా? ఏమీ లేదు. కానీ నీకు శాంతి కావాలి అంటే శాంతి ఎలా వస్తుంది? శాంతిలేని వాడికి సుఖం ఎక్కడ నుండి వస్తుంది. ముందు నువ్వు భగవంతుడు ఉన్నాడని విశ్వసించి, ఆయన పాదాలను ఆశ్రయించి, నిరంతరం ఆయనను స్మరిస్తూ ఉంటే, ఆయనను ధ్యానిస్తూ ఉంటే అప్పడు ఆయన నీకు వ్యక్తమవుతాడు, అప్పడు నీకు శాంతి కలుగుతుంది, సుఖం కలుగుతుంది, ఆనందం కలుగుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 08-06-05<br>16-06-05 | | ఆరుణాచలం క్యాంపు |
| 26-06-05 | ఆది | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో మ॥ గం॥ 2-00లకు శ్రీ నాన్నగారు ప్రసంగించెదరు (ఈ సభలో సాగిరాజు రామకృష్ణంరాజుగారిచే రచించబడిన **"అమృత వాహిని"** గ్రంథమును శ్రీ నాన్నగారు ఆవిష్కరించెదరు) |

# అబద్ధాన్ని అబద్ధంగా చూచేవరకూ జ్ఞానం కలుగదు

ఒక సమయంలో ఉండి, ఒక సమయంలో లేని మనస్సు మార్పుచెంది నశించే శరీరం అబద్ధము. జ్ఞానులు దానికి విలువ ఇవ్వరు. సర్వకాలాలలోనూ సర్వ అవస్థలలోనూ ఉండే ఆత్మ ఒక్కటే సత్యం అది మన అనుభవంలో లేక అనిజాన్ని నిజమనుకొని భ్రమించి, యాతనామయమైన ఈ జనన మరణ చక్రంలో నుంచి తప్పుకోలేకపోతున్నాము. దీనికి పరిష్కారం ఒక్కటే "బ్రహ్మం సత్యం జగత్తు మిథ్య" ఈ మందును సేవించాలి. అబద్ధాల పుట్ట అయిన మనస్సు ఊహా ప్రతిమలను నిర్మించు కొంటుంది. అందులో ఒక్కటీ వాస్తవం కాదు. అందులో భద్రత కోసం, సుఖం కోసం మనం వెదుకుతూ విసిగివేసారి పోతున్నాము, వాస్తవంగా మన శరీరంలో ఉన్నది ఎముకలు, నరాలు, పచ్చిమాంసం, మలమూత్రాలు, వాటిని కప్పుతూ, మన ప్రారబ్ధాన్ని అనుసరించి నలుపు లేదా తెలుపు చర్మాన్ని పైన కప్పుతున్నాడు ఈశ్వరుడు. మనం మోహం అనే అద్దంలోంచి చూస్తూ ఉన్నందువలన లోపల ఉన్న వ్యర్థ పదార్థాలు మనకు స్ఫురణకు రావటం లేదు. కొంచెం తెలివి, కొంచెం వివేకం చూపితే, దానికి గురువు యొక్క సత్యస్ఫురణ తోడైతే ఇది అబద్ధమని తేలిపోతుంది. అందమైన శరీరం ఉందని అందమైన జీవితం ఉంటుందని ఎక్కడా సిద్ధాంతం లేదు. అజ్ఞానానికి ఆటపట్టైన కోరికలు ఉన్నంతకాలం ఈ రూపం బాగుంది ఇది బాగాలేదు అనే భావాలు ఉంటాయి. ఇవే సంసారవృక్షానికి బీజాలు. మనం ఈ మాయా స్వప్నం నుంచి మేలుకొని ధర్మ జీవనంతో ఈ శరీర భ్రాంతులను తొలగించుకొన్నప్పుడే, వస్తువులను దైవనేత్రంతో చూచేభాగ్యం కలుగుతుంది. దీనికి ఎరుకతో కూడిన కృషి కావాలి లేదా పతనం తప్పదు. ఈ అబద్ధాలు అనేక రకాలు, నిందా వాక్యాలు పడవలసినప్పుడు, ఆ అనేవాడు ఈ పడేవాడు అబద్ధమని తిరస్కరించాలి. స్వీకరిస్తే బదులు చెప్పటంతో దుఃఖం అంటుకొంటుంది. అప్పుడు మనం సాధకులము ఎలా అవుతాము? శ్రీ నాన్నగారు అంటారు "చైతన్యం-మాయ యొక్క కూడికే ఈ ప్రపంచం. కృషి పట్టుదలతో అడ్డుగా ఉన్న మమకారాలనే ఆటంకాలను తొలగించుకోవాలి. అవాస్తవాన్ని కాదు, కాదు అనుకొంటే వాస్తవంలోకి వస్తాము" అన్నారు. స్వయంవరంలో సీత, ఇది కాదు, ఇది కాదు అని రాముని సన్నిధికి వచ్చి మౌనం వహించినట్లే మనం ప్రకృతి మాయా రూపాలను కాదు, కాదు అంటూ గురుమౌనంలో నిలవాలి అదే జ్ఞాన ఫలం.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం

